క్లుప్తంగా

నేడు సహస్ర తులసీ దళార్చన

దాబాగార్డెన్స్: కనకమహాలక్ష్మి దేవాలయంలో ప్రతి గురువారం ఉదయం 8 నుంచి 9 గంటల వరకు సహస్ర తులసిపూజ నిర్వహించనున్నారు. పూజలో పాల్గొనదలిచే భక్తులు రూ.1,500 పూజా రుసుం చెల్లించి పాల్గొనవచ్చు. భక్తులు యూనియన్ బ్యాంక్ ఆఫ్ ఇండియా, టౌన్‌కొత్తరోడ్డు శాఖ, అకౌంట్ నంబరు 060810011006691, ఐఎఫ్‌ఎస్‌సీ కోడ్ యూబీఐఎన్ 0806091లో చెల్లించాలి. ఆన్‌లైన్ ద్వారా ట్రాన్స్‌ఫర్ చేసిన భక్తులు వివరాలు, పూజ జరిపించాల్సిన వారి పేరు, గోత్రనామాలు, పూర్తి చిరునామా, ఫోన్ నంబరును 8985515989 నంబరుకు వాట్సాప్ చేయాలి.

23న డిగ్రీ సబ్జెక్టులపై అవగాహన

దాబాగార్డెన్స్: జాతీయ విద్యా విధానం–2020 ప్రకారం డిగ్రీ కోర్సుల్లో ప్రవేశపెడుతున్న డిగ్రీ ఆనర్స్, సింగిల్ మేజర్ సబ్జెక్టులపై విద్యార్థులు, తల్లిదండ్రులకు ఈ నెల 23న దాబాగార్డెన్స్‌లో గల ఆదిత్య డిగ్రీ కళాశాలలో అవగాహన కార్యక్రమం నిర్వహించనున్నట్టు కళాశాల ప్రిన్సిపాల్ ఒక ప్రకటనలో తెలిపారు. ఏపీఎస్‌సీహెచ్‌ఈ ఆదేశాల మేరకు ఆ రోజు ఉదయం 10 గంటలకు నిర్వహించనున్న అవగాహన సదస్సులో ఇంటర్మీడియట్ పూర్తి చేసిన విద్యార్థులు పాల్గొని నాలుగు లేదా మూడేళ్ల డిగ్రీ గురించి అవగాహన పెంపొందించుకోవచ్చని తెలిపారు. స్కిల్ డెవలప్‌మెంట్, మల్టీ డిసిప్లినరీ వంటి కోర్సుల పట్ల పట్టు సాధించవచ్చని, ఈ అవగాహన సదస్సును ఇంటర్మీడియట్ పూర్తి చేసిన విద్యార్థులు వినియోగించుకోవాలన్నారు.

కాటమ్మవారికి ఘనంగా పూజలు



సీతమ్మధార: పీ అండ్ టీ కాలనీలో కొలువైన శ్రీ కాటమ్మ అమ్మవారి ఆలయ పదో వార్షికోత్సవం బుధవారం ఘనంగా నిర్వహించారు. అమ్మవారికి ఉదయం పంచామృతాభిషేకం, విశేష పూజలు చేశారు. కాటమ్మను ప్రత్యేకంగా అలంకరించి భక్తులకు దర్శనం కల్పించారు. ఈ సందర్భంగా పేద మహిళలకు చీరలు పంపిణీ చేశారు. శ్రీ కాటమ్మ, శ్రీ నాగమ్మ అమ్మవార్లకు వెండి తొడుగులు (5.5 కిలోలు) ధరించారు. కార్యక్రమంలో గ్రామ పెద్దలు పాల్గొన్నారు.

స్వరూపానందేంద్ర సరస్వతిని కలిసిన నాయకులు



స్వరూపానందేంద్ర సరస్వతికి పూలమాలవేస్తున్న వైఎస్సార్‌సీపీ నాయకులు

సింహాచలం: విశాఖ శ్రీ శారదాపీఠాధిపతి స్వరూపానందేంద్ర సరస్వతిని చినముషిడివాడలోని శారదాపీఠంలో బుధవారం పలువురు వైఎస్సార్‌సీపీ నాయకులు కలిశారు. రిషికేష్‌లో చాతుర్మాస దీక్షకు బయలుదేరి వెళ్లిన స్వామీజీకి అభినందనలు తెలియజేశారు. స్వామీజీ ఆశీస్సులు తీసుకున్నారు. 95వ వార్డు కార్పొరేటర్ ముమ్మన దేముడు, వైఎస్సార్‌సీపీ రాష్ట్ర నాయకుడు బైలపూడి భగవాన్ జయరామ్, 93వవార్డు వైఎస్సార్‌సీపీ నాయకుడు దాసరి సత్తిబాబు, అప్పలరాజు స్వామీజీని కలిసిన వారిలో ఉన్నారు.

టెన్త్ టాపర్‌కు అభినందనలు

సీతంపేట: ఇటీవల విడుదలైన ఐసీఎస్‌ఈ పదో తరగతి ఫలితాల్లో 98.4 శాతం మార్కులు సాధించి టాపర్‌గా నిలిచిన దొగ్గ తేజను టింపనీ స్కూల్ యాజమాన్యం అభినందించింది. ఇంగ్లిష్ లిటరేచర్, హిస్టరీ అండ్ సివిక్స్, కంప్యూటర్ సైన్స్‌లో నూటికి నూరు శాతం మార్కులు, తెలుగులో 99 శాతం మార్కులు సాధించాడని తెలిపారు. ఈ సందర్భంగా పాఠశాలలో బుధవారం నిర్వహించిన కార్యక్రమంలో స్కూల్ డైరెక్టర్లు, ప్రిన్సిపాల్స్, ఉపాధ్యాయులు తేజను అభినందించి, ప్రశంసాపత్రం అందజేశారు. స్కూల్ అడ్వైజర్ నళినీ నెల్సన్ మాట్లాడుతూ ఈ ఏడాది టింపనీ స్కూల్ విద్యార్థులు నూటికి నూరు శాతం ఉత్తీర్ణత సాధించారని చెప్పారు.

భయపెడుతున్న భవంతులు

- కూలేందుకు సిద్ధంగా పురాతన కట్టడాలు
- భయాందోళనల్లో పాతనగరవాసులు
- నోటీసులు జారీ చేశామంటున్న జీవీఎంసీ అధికారులు



పాత భవనాన్ని కూలుస్తున్న దృశ్యం



వన్‌టౌన్ పోలీస్ స్టేషన్ సమీపంలో కూలేందుకు సిద్ధంగా ఉన్న పాత భవంతి

పురాతన భవంతులు.. పాత ఇళ్లు కూలిన ఘటనలు ఇటీవల అధికమయ్యాయి. ఇటువంటి ఘటనల్లో వ్యక్తులు క్షతగాత్రులు కావడం.. ప్రాణాలు కోల్పోవడం జరుగుతుంది. రానున్నది వర్షాకాలం కావడంతో పాత కట్టడాల పట్ల అప్రమత్తం కావాల్సిన సమయం ఆసన్నమయింది. ఈ విషయంలో అధికారులు ఏమాత్రం ఆలస్యం చేయకుండా ఇటువంటి భవంతులను తొలగించాలని పురాతన కట్టడాలు అధికంగా ఉండే పాతనగరవాసులు కోరుతున్నారు.

దాబాగార్డెన్స్: ఏడాది కిందట ఇదే మాసంలో కురిసిన వర్షాలకు పాతనగరంలో పలు ఇళ్లు పగుళ్లిచ్చాయి. కొన్ని పాక్షికంగా కూలాయి. ఏడు నెలల కిందట కోడిపండ్యాల వీధిలో ఓ ఇంటి ప్రహరీ కూలి ఓ వ్యక్తి మంచం పట్టాడు. ఐదు నెలల కిందట ఇసుకకొండపై ఉన్నట్టుండి ఓ ఇల్లు నేలకొరిగింది. ఆ ఘటనలో ఓ పెద్దాయన ఆసుపత్రి పాలయ్యాడు. మూడు నెలల కిందట రామజోగిపేటలో మూడంతస్తుల ఇల్లు కూలింది. ఈ ఘటనలో ముగ్గురు వ్యక్తులు అక్కడికక్కడే మృతి చెందారు. తాజాగా టౌన్‌కొత్తరోడ్డు రాజా రామ్మోహన్‌రాయ్ రోడ్డులో ఇటీవల కురిసిన వర్షానికి ఇంటి ముందు భాగం కూలింది. ఈ ఘటనలో ఇద్దరు వ్యక్తులు తీవ్రగాయాలపాలై ఆసుపత్రికి చేరారు. ఇవన్నీ పాతనగరంలో గల పాత భవనాలు.. ఇళ్లే. గతంలో ఫిషింగ్ హార్బర్ రోడ్డు లైట్‌హౌస్ వద్ద ఓ ఇంటి ప్రహరీ కూలిన ఘటనలో ద్విచక్ర వాహనాలు ధ్వంసమయ్యాయి.

ఇలాంటి ఘటనలు వర్షం వచ్చినప్పుడల్లా చోటు చేసుకుంటున్నాయి. కానీ అధికారులు మాత్రం తూతూ మంత్రంగా చర్యలు చేపడుతున్నారు. సంఘటన జరిగిన రోజున పెద్ద ఎత్తున సహాయక చర్యలు చేపట్టి.. తర్వాత షరా మామూలే అన్నట్టుగా వ్యవహరిస్తున్నారు. రానున్నది వర్షాకాలం. పాత నగరంలో ఎప్పుడు ఏ బిల్డింగ్ కూలుతుందోనన్న భయంతో జనం బిక్కుబిక్కుమంటున్నారు. ప్రమాదం జరగక ముందే అధికారులు చర్యలు చేపట్టాలని పాతనగర వాసులు కోరుతున్నారు.

శిథిలావస్థకు చేరుకున్న ఇళ్లు కోకొల్లలు..

విశాఖ పాతనగరంలో శిథిలావస్థకు అనేక ఇళ్లు చేరుకున్నాయి. అలాగే గత ప్రభుత్వాలు నిర్మించిన స్కీం ఇళ్లతో పాటు వాంబే గృహాలు పెచ్చులూడుతున్న సందర్భాలున్నాయి. ఏ పాటి వర్షం కురిసినా వారంతా బిక్కుబిక్కుమంటున్నారు. ప్రమాదం సంభవించక ముందే తగు జాగ్రత్తలు తీసుకుంటే బాగుంటుందని పలువురు అభిప్రాయపడుతున్నారు. ముఖ్యంగా పాతనగరలో కోటవీధి, పాతపోస్టాఫీస్, అంబుసరంగు వీధి, చాగంటివారి వీధి, థామ్సన్ స్ట్రీట్, రెల్లివీధి, చిలకపేట, పద్మానగర్, తారకరామకాలనీ తదితర ప్రాంతాల్లో పలు గృహాలు శిథిలావస్థకు చేరుకున్నాయి.

నోటీసులు జారీ చేసినా..

పాతనగరంలో శిథిలావస్థకు చేరుకున్న పలు పాత భవనాలకు జీవీఎంసీ నోటీసులు జారీ చేసింది. నోటీసులు అందుకున్న వారిలో కొందరు ముందుకొచ్చి పాత భవనాలు నేలమట్టం చేస్తున్నారు. మరికొంత మంది యజమానులు స్పందించకుండా భీష్మించుకుంటున్నారు. శిథిలావస్థకు చేరుకున్న భవనాలకు సంబంధించి యజమానులకు నోటీసులిచ్చి హెచ్చరికలు జారీ చేస్తున్నాం. స్పందించకపోతే కూల్చేందుకు జీవీఎంసీ సిద్ధం.

– వినయ్‌కుమార్,
అసిస్టెంట్ సిటీ ప్లానర్, జీవీఎంసీ, జోన్–4

మంచినీటి ఎద్దడి నివారించండి



మేయర్ హరివెంకటకుమారికి వినతిపత్రం అందజేస్తున్న కార్పొరేటర్ పద్మావతి

అల్లిపురం: జీవీఎంసీ 34వ వార్డు ప్రజల అవసరాలకు అనుగుణంగా రిజర్వాయర్ నిర్మాణానికి, పైప్‌లైన్ల మార్పుల పనులు మంజూరు చేయాలని వార్డు కార్పొరేటర్ తోట పద్మావతి మేయర్ గొలగాని హరి వెంకటకుమారిని కోరారు. బుధవారం ఆమె వార్డు సీనియర్ నాయకులు లండా రమణ, లింగం శ్రీనివాస్‌లతో కలిసి వినతిపత్రం అందజేశారు. వార్డులో మంచి నీటి ఎద్దడి తీవ్రంగా ఉందని మేయర్ దృష్టికి తీసుకువచ్చారు. సుమారు 30 వేల మంది జనాభా ఉన్నారని, వారి అవసరాలకు తగినంత నీటి సరఫరా జరగటం లేదన్నారు. వార్డు ప్రజల అవసరాల నిమిత్తం వెయ్యి కేఎల్ సర్వీస్ రిజర్వాయర్ వార్డులోని బౌడరారోడ్డులో గల ప్రభుత్వ స్థలంలో నిర్మించాలని కోరారు. అదే విధంగా వార్డులో గల పైప్‌లైన్లు 50 సంవత్సరాల పైబడినవి కావటంతో ఎక్కువగా మరమ్మతులకు గురవుతున్నాయని అన్నారు. వాటి స్థానంలో కొత్త పైప్‌లైన్లు వేయాలని కోరారు. అనంతరం జీవీఎంసీ కమిషనర్‌కు వినతిపత్రం అందజేశారు.

స్పీడ్‌బేకర్లు ఏర్పాటు చేయాలి



స్పీడ్‌బేకర్లు ఏర్పాటు చేయాల్సిన ప్రదేశం

జగదాంబ : స్పీడ్ బేకర్లు లేక హార్బర్ పోలీసు స్టేషన్ సమీపంలో ప్రమాదాలు చోటు చేసుకుంటున్నాయని రామకృష్ణ జంక్షన్ ప్రజలు చెబుతున్నారు. కొబ్బరితోట, జ్ఞానాపురం జంక్షన్లు నిత్యం వాహనాలతో రద్దీగా ఉంటాయి. అలాగే పోర్టులోకి వెళ్లే రైల్వే ట్రాక్ కూడా ఈ జంక్షన్ మీదుగానే వెళ్తుంది. రద్దీ సమయంలో రక్షణకు ఇక్కడ గతంలో ప్లాస్టిక్, ఫైబర్‌తో కూడిన స్పీడ్ బ్రేకర్లు ఉండేవి. అయితే వాహనాల నిరంతర రాకపోకలతో స్పీడ్‌బ్రేకర్లతో పాటు తారు రోడ్డు కూడా శిథిలమై ఈ ప్రాంతం ప్రమాదాలకు నిలయంగా మారిందని స్థానికులు చెబుతున్నారు. సంబంధిత అధికారులు స్పందించి నాణ్యమైన స్పీడ్ బ్రేకర్లు వేసి ప్రమాదాలను అరికట్టాలని కోరుతున్నారు.

దిశ పోలీసుల విచారణ

గోపాలపట్నం: ఎన్ఏడీ ఫ్లై ఓవర్ బ్రిడ్జి దిగువన బాలికపై వృద్ధుడు లైంగికదాడికి యత్నించిన ఘటనపై దిశ పోలీస్ స్టేషన్ డీఎస్పీ వివేకానంద్ విచారణ చేపట్టారు. నాలుగేళ్ల బాలికపై 60 ఏళ్ల వృద్ధుడు లైంగికదాడికి యత్నించిన విషయం తెలిసిందే. ఈ కేసును ఎయిర్‌పోర్టు జోన్ పోలీసులు దిశ పోలీస్ స్టేషన్‌కు బదలాయించారు. దీంతో దిశ పోలీసులు విచారణ చేపట్టారు. ఈ మేరకు ఫిర్యాది రోజామణి సమక్షంలో స్థానికుల నుంచి వివరాలు సేకరించారు. కేసు నమోదు చేశామని, దర్యాప్తు చేస్తున్నామని వివేకానంద్ తెలిపారు.

అత్యాధునికంగా ప్రేమసమాజం ఆడిటోరియం



నూతన ఆడిటోరియంను ప్రారంభిస్తున్న కృష్ణప్రసాద్, కంచర్ల రాంబ్రహ్మం

దాబాగార్డెన్స్: అత్యాధునికంగా రూపొందించిన ప్రేమసమాజం ఆడిటోరియంను బుధవారం అధ్యక్షుడు పైడా కృష్ణప్రసాద్ ప్రారంభించారు. మొదటి అంతస్తు నూతన టెక్నాలజీతో నిర్మించినట్లు తెలిపారు. ఎప్పటి నుంచో ఉన్న ప్రేమసమాజం ఆడిటోరియం నగర కళాకారులు కార్యక్రమాలు నిర్వహించుకునేందుకు వీలుగా ఉండేదన్నారు. అధునాతన రీతిన ఏసీ సౌకర్యం.. మంచి సౌండ్ సిస్టమ్‌తో ఆడిటోరియం రూపొందించినట్లు తెలిపారు. కార్యక్రమంలో ప్రేమసమాజం పూర్వ అధ్యక్షుడు కంచర్ల రాంబ్రహ్మం, కార్యదర్శి కోన జగదీశ్వరరావు, కోశాధికారి మట్టపల్లి హనుమంతరావు, ఉపాధ్యక్షుడు బుద్దా శివాజీ, కె. నరసింహమూర్తి తదితరులు పాల్గొన్నారు.

సమాజ పోకడలను ప్రతిబింబించేలా కథలు



మాట్లాడుతున్న రచయిత హనుమంతరావు

సీతంపేట: సమాజ పోకడలను కథలు ప్రతిబింబించాలని రచయిత ఎస్.హనుమంతరావు అన్నారు. సహృదయ సాహితి సంస్థ ఆధ్వర్యంలో బుధవారం స్థానిక ప్రిజమ్ కళాశాలలో కొత్త కథల–22 సంకలనంపై జరిగిన చర్చా గోష్ఠిలో ఆయన మాట్లాడారు. యువ కథా రచయితలు వివిధ సామాజిక అంశాలను ఎంచుకుని చక్కని కథనంతో రాశారన్నారు. ఈ సంకలనంలో పెద్దింటి అశోక్‌కుమార్, ఉమా నూతక్కి, మన్ ప్రీతం, సుజాత వేల్పూరి, కుమార్ కూనపరాజు, ఖదీర్‌బాబు మున్నగు రచయితలు రాసిన కథలున్నాయని తెలిపారు. వర్తమాన సమాజ పోకడలను, కథా వస్తువులో భిన్నత్వం, శైలి, శిల్పాలపై ప్రత్యేక దృష్టి రచయితలకు ఉండాలని సూచించారు. కార్యక్రమంలో శేఖరమంత్రి ప్రభాకర్, కె.జి. వేణు, డి.వి.సూర్యారావు, కె.వి.ఎస్.మూర్తి, అడపా రామకృష్ణ తదితరులు పాల్గొన్నారు.

'రైజ్ ఆఫ్ ది ప్రౌడ్ ఇంట్రావర్ట్స్' పుస్తకావిష్కరణ



పుస్తకాన్ని ఆవిష్కరిస్తున్న అతిథులు

సీతంపేట: నగరానికి చెందిన యువ రచయిత నిమ్మాని సంతోష్ రచించిన 'రైజ్ ఆఫ్ ది ప్రౌడ్ ఇంట్రావర్ట్స్' పుస్తకావిష్కరణ సభ బుధవారం ద్వారకానగర్ పౌర గ్రంథాలయంలో జరిగింది. ముఖ్య అతిథులు ఆర్ఎస్ఎస్ సంఘ చాలక్ పి.వి.నారాయణరావు, బీజేపీ కన్వీనర్ కొప్పుల రామ్‌కుమార్, జీవీపీ కళాశాల డైరెక్టర్ డాక్టర్ రవిశంకర్ సరిపల్లే, విశాఖ స్టీల్‌ప్లాంట్ జీఎం కె.వి.రావు చేతుల మీదుగా పుస్తకాన్ని ఆవిష్కరించారు. ఈ సందర్భంగా రచయిత సంతోష్ మాట్లాడుతూ ఇంట్రోవర్ట్స్ అంటే అంతర్ముఖులని, నిజ జీవితంలో మనం ఇలాంటి వారిని చూస్తుంటామన్నారు. ఎవరితో ఎక్కువగా మాట్లాడకుండా, జనాలకు దూరంగా, కలుపుగోలుతనం లేకుండా కొంతమంది మనకు తారసపడుతుంటారన్నారు. అటువంటి వారిని ఏ విధంగా మామూలు వ్యక్తులుగా మార్చుకోవాలి దానికి సంబంధించిన టెక్నిక్స్, ఎక్సర్‌సైజులు పుస్తకంలో పొందుపర్చినట్లు తెలిపారు. ఇది ప్రతి ఒక్కరూ చదవాల్సిన పుస్తకమని అతిథులు పేర్కొన్నారు. బుక్ మ్యాజిక్ లైబ్రరీ వ్యవస్థాపకుడు హరి మాదాల, పిక్ ఏ బుక్ సంస్థ ప్రతినిధికృష్ణకిరణ్ పుస్తకాన్ని సమీక్షించారు.

ఏఎంసీ వార్షిక క్రీడాపోటీలు ప్రారంభం



త్రోబాల్ పోటీల్లో తలపడుతున్న క్రీడాకారిణులు

విశాఖ స్పోర్ట్స్: పేస్–23 పేరిట నిర్వహిస్తున్న ఏఎంసీ వార్షిక క్రీడా పోటీలు బుధవారం మేజర్ ఎడ్విన్ స్మారక గ్రౌండ్‌లో ప్రారంభమయ్యాయి. ఏఎంసీ సెంటినరీ వేడుకల్లో భాగంగా జరుగుతున్న ఈ పోటీలను ఏఎంసీ ప్రిన్సిపాల్ జి.బుచ్చిరాజు ప్రారంభించారు. స్టూడెంట్స్‌కు క్రికెట్, వాలీబాల్, బాస్కెట్‌బాల్, ఫుట్‌బాల్, బాల్‌బ్యాడ్మింటన్, బ్యాడ్మింటన్, త్రోబాల్, టెన్నిస్, టీటీ, చెస్, క్యారమ్ పోటీలు, ఫ్యాకల్టీకి క్రికెట్, త్రోబాల్, చెస్, క్యారమ్, టీటీ, బ్యాడ్మింటన్ పోటీలు నిర్వహించనున్నారు. పోటీలను పీడీ పాత్రుడు, నిర్వాహక ప్రతినిధులు కార్తీక్, హర్షిత, చెన్నకేశవ, శివసత్య పర్యవేక్షిస్తున్నారు. త్రోబాల్ ప్రారంభ పోటీలో 2కె20 బ్యాచ్ జట్టుతో 2కె22 బ్యాచ్ జట్టు తలపడింది. తొలిరోజు మెన్‌కు క్రికెట్, బాల్ బ్యాడ్మింటన్ పోటీలు నిర్వహించారు.

వైభవంగా నిత్యకల్యాణం

సింహాచలం: శ్రీ వరాహ లక్ష్మీనృసింహస్వామికి బుధవారం నిత్యకల్యాణం విశేషంగా జరిగింది. ఆలయ కల్యాణ మండపంలో ఉదయం 9.30గంటల నుంచి కల్యాణాన్ని శాస్త్రోక్తంగా నిర్వహించారు. స్వామివారి ఉత్సవమూర్తులు గోవిందరాజస్వామి, శ్రీదేవి,భూదేవిలను వేదికపై అధిష్ఠంపజేశారు. విష్వక్సేనపూజ, పుణ్యాహవచనం, కంకణధారణ, యజ్ఞోపవీతం, జీలకర్రబెల్లం, మాంగల్యధారణ, తలంబ్రాలు ఘట్టాలతో కల్యాణం నిర్వహించారు. ఉభయదాతలకు ప్రసాదం, అక్షింతలు, శేషవస్త్రాలు అందజేశారు.

ఓపెన్ ఎయిర్ థియేటర్ సందర్శన



ఓపెన్ ఎయిర్ థియేటర్‌ను సందర్శిస్తున్న హేమచంద్రారెడ్డి తదితరులు

ఏయూ క్యాంపస్: ఆంధ్ర విశ్వవిద్యాలయంలో ఆధునికీకరించిన ఓపెన్ ఎయిర్ థియేటర్‌ను రాష్ట్ర ఉన్నత విద్యా మండలి చైర్మన్ ఆచార్య కె.హేమచంద్రారెడ్డి బుధవారం సందర్శించారు. విశాఖకు విచ్చేసిన ఆయన ఏయూ వీసీ ఆచార్య పి.వి.జి.డి.ప్రసాదరెడ్డితో కలిసి వర్సిటీలో జరుగుతున్న అభివృద్ధి పనులను పరిశీలించారు. కళలకు నిలయంగా ఆంధ్ర విశ్వవిద్యాలయాన్ని నిలిపే దిశగా ఆరుబయలు రంగస్థలాన్ని పూర్తి స్థాయిలో ఆధునికీకరించామని వీసీ తెలిపారు. దీనిపై ఉన్నత విద్యా మండలి చైర్మన్ సంతోషం వ్యక్తం చేశారు. ఈ కార్యక్రమంలో రిజిస్ట్రార్ ఆచార్య వి.కృష్ణమోహన్, తదితరులు పాల్గొన్నారు.

మానవాళికి వరం.. యోగ



ఏవీఎన్ కళాశాలలో విద్యార్థులతో కలిసి సూర్యనమస్కారాలు చేస్తున్న ప్రిన్సిపాల్ సింహాద్రినాయుడు



మహిళా కళాశాలలో విద్యార్థినులతో పాటు యోగాసనాలు వేస్తున్న ప్రిన్సిపాల్ శోభారాణి తదితరులు

దాబాగార్డెన్స్: నగరంలోని ఏవీఎన్ కళాశాలలో యోగా దినోత్సవం ఘనంగా నిర్వహించారు. కళాశాల ప్రిన్సిపాల్ మొజ్జాడ సింహాద్రినాయుడు పాల్గొని మాట్లాడారు. యోగాకు యావత్ ప్రపంచం పట్టాభిషేకం చేస్తోందన్నారు. వైద్య శాస్త్రంలో యోగా నయం చేయలేని జబ్బు లేదన్నారు. యోగా శిక్షకురాలు, కళాశాల ఇంగ్లీషు విభాగాధిపతి పైడి రజని విద్యార్థులకు యోగాసనాలపై శిక్షణ ఇచ్చారు. అనంతరం విద్యార్థులు సూర్య నమస్కారాలు చేసి యోగాసనాలు వేశారు. ఆరోగ్యానికి, మనోల్లాసానికి యోగా గొప్ప వరమని ఆమె పేర్కొన్నారు. ఆసక్తి గల విద్యార్థులు తనను సంప్రదిస్తే యోగాసనాలపై శిక్షణ ఇవ్వనున్నట్టు పైడి రజని పేర్కొన్నారు. కార్యక్రమంలో కళాశాల విమెన్ సెల్ సభ్యులు స్వరాజ్యలక్ష్మి, ఐక్యూఏసీ కో ఆర్డినేటర్ కృష్ణకుమారి, ఎన్‌సీసీ, ఎన్ఎస్ఎస్ విభాగాలతో పాటు టీచింగ్, నాన్ టీచింగ్ స్టాఫ్, విద్యార్థులు పాల్గొన్నారు.

ప్రభుత్వ మహిళా కళాశాలలో..

విశాఖ ప్రభుత్వ మహిళా కళాశాలలో అంతర్జాతీయ యోగా దినత్సోవాన్ని పురస్కరించుకుని కళాశాలలో గల పలు విభాగాలు సంయుక్తంగా యోగా దినోత్సవాన్ని నిర్వహించాయి. కార్యక్రమంలో పాల్గొన్న కళాశాల ప్రిన్సిపాల్ డాక్టర్ ఎస్. శోభారాణి మాట్లాడుతూ యోగా ఆవశ్యకతను విద్యార్థులకు వివరించారు.

పలు కళాశాలల్లో యోగా దినోత్సవం

బ్రహ్మకుమారీ ఈశ్వరీయ విశ్వ విద్యాలయ మెడిటేషన్ ట్రైనర్ సిస్టర్ మాధురి విద్యార్థినులకు ధ్యానం వల్ల కలిగే ప్రయోజనాలు వివరించారు. ఈ సందర్భంగా విద్యార్థినులచే యోగాసనాలు వేయించారు. కార్యక్రమంలో కళాశాల వైస్ ప్రిన్సిపాల్ వై. లక్ష్మి, ఫిజికల్ డైరెక్టర్ డాక్టర్ ఆర్. కిరణ్మయి, పుష్పలత, అనురాధ, పద్మకుమారి, కె. గీతాంజలి, అరుణపద్మ తదితరులు పాల్గొన్నారు.

సహజ యోగ ట్రస్ట్ ఆధ్వర్యంలో..

యోగా ప్రతి ఒక్కరి జీవితంలో భాగం కావాలని సహజ యోగ ట్రస్ట్ ఏపీ మహిళా శక్తి కో ఆర్డినేటర్ పద్మావతి పేర్కొన్నారు. సహజయోగ ట్రస్ట్ ఆధ్వర్యంలో జీవీఎంసీ పాఠశాలలో 9వ అంతర్జాతీయ యోగా దినోత్సవం నిర్వహించారు. స్కూల్ విద్యార్థులతో కలిసి యోగ సాధన చేశారు. ఈ సందర్భంగా పద్మావతి, కెప్టెన్ బాబూరావు, ప్రసాద్ మాట్లాడుతూ యోగా వల్ల మానసిక ప్రశాంతత చేకూరుతుందన్నారు. జీవన ప్రయాణంలో ప్రతి ఒక్కరూ ఎన్నో ఒడిదుడుకులు, ఒత్తిడి, నిరాశ, నిస్పృహలతో బాధపడుతూ జీవితాన్ని కొనసాగిస్తున్నారని చెప్పారు. కార్యక్రమంలో విద్యార్థులతో పాటు సింహాద్రి సత్యనారాయణ, రమేష్, నిర్మల్ కుమార్, కుసుమ తదితరులు పాల్గొన్నారు.

ఎఫ్ఎస్ఐలో..

మహారాణిపేట : బీచ్ రోడ్డులో ఉన్న భారతీయ మత్స్య పరిశోధన సంస్థ (ఎఫ్ఎస్ఐ) కార్యాలయ ఆవరణలో బుధవారం అంతర్జాతీయ యోగా దినోత్సవం నిర్వహించారు. ఈ కార్యక్రమంలో సంస్థ ముఖ్య అధికారి డి.భామిరెడ్డి మాట్లాడుతూ యోగా వల్ల మనస్సు, శరీరం ఉత్సాహంగా ఉంటాయన్నారు. జీవీఎంసీ మున్సిపల్ హైస్కూలు యోగా అధ్యాపకుడు బి.ప్రభాకర్ యోగాసనాలు వేయించారు. ఈ కార్యక్రమంలో సంస్థకు చెందిన అధికారులు, సిబ్బంది పాల్గొన్నారు.

ఆదిత్య డిగ్రీ కళాశాలలో..

దాబాగార్డెన్స్: స్థానిక ఆదిత్య డిగ్రీ కళాశాలలో బుధవారం అంతర్జాతీయ యోగా దినోత్సవం ఘనంగా నిర్వహించారు. కార్యక్రమంలో కళాశాలలో ఉత్తరాంధ్ర సంచాలకుడు పి. రామకృష్ణారెడ్డి పాల్గొన్నారు. ఈ సందర్భంగా కళాశాల ప్రిన్సిపాల్ కె. కుమార్ మాట్లాడుతూ యోగా అనే పదం యూజ్ అనే సంస్కృత పదం నుంచి పుట్టిందని, దీని అర్థం కలిపి ఉంచేదని..అనగా మనసుని..శరీరాన్ని కలిపి ఉంచేదని తెలిపారు. కార్యక్రమంలో వైస్ ప్రిన్సిపాల్ ఎస్‌వీ బాబ్జీ, ఎన్ఎస్ఎస్ ప్రోగ్రాం ఆఫీసర్ డాక్టర్ ఎస్. భాస్కరరావు, విద్యార్థులు పాల్గొన్నారు.



ఆసనాలు వేస్తున్న మత్స్య పరిశోధనా సంస్థ సిబ్బంది



సహజ యోగా ట్రస్ట్ ఆధ్వర్యంలో..



యోగాసనాలు వేస్తున్న విద్యార్థులు

లలితానగర్‌లో కూలిన భారీ వృక్షం



లలితానగర్ సాక్షి రోడ్డులో కూలిన చెట్టు

సీతంపేట: జీవీఎంసీ 26వ వార్డు లలితానగర్ 'సాక్షి' రోడ్డులో బుధవారం ఉదయం భారీ చెట్టు నేలకొరిగింది. వ్యాన్ ఢీకొట్టడంతో చెట్టు ఉన్నపళంగా కూలిపోయిందని స్థానికులు తెలిపారు. రోడ్డుకు అడ్డంగా చెట్టు కూలడంతో ఆ మార్గంలో రాకపోకలు నిలిచిపోయాయి. ఉదయం పెద్దగా జన సమచారం లేకపోవడంతో ఎవరికీ ఏమి జరగకపోవడంతో అంతా ఊపిరి పీల్చుకున్నారు. శంకరమఠం రోడ్డు నుంచి అక్కయ్యపాలెం మెయిన్ రోడ్డుకు వెళ్లే వాహనచోదకులు వేరే రహదారులను ఆశ్రయించారు. ఉదయం కూలిన చెట్టు రాత్రి చీకటిపడినా తొలగించలేదని స్థానికులు అహసనం వ్యక్తం చేశారు. సంబంధిత అధికారులు స్పందించి చెట్టు తరలించే ఏర్పాట్లు చేయాలని కోరుతున్నారు.

860వ రోజుకు 'ఉక్కు' రిలే దీక్షలు



860వ రోజు దీక్షలో పాల్గొన్న పోరాట కమిటీ నాయకులు

కూర్మన్నపాలెం: దేశంలోనే పెద్ద పరిశ్రమగా అవతరించిన విశాఖ ఉక్కు కర్మాగారాన్ని ప్రైవేట్ వ్యక్తులకు అమ్మాలనుకోవడం దారుణమని ఉక్కు పరిరక్షణ, పోరాట కమిటీ నాయకులు అన్నారు. దీనిని అడ్డుకుని తీరతామన్నారు. స్టీల్‌ప్లాంట్ ప్రైవేటీకరణకు వ్యతిరేకంగా కూర్మన్నపాలెం కూడలిలోని స్టీల్‌ప్లాంట్ ఆర్చి వద్ద జరుగుతున్న రిలే నిరాహార దీక్షల్లో 860వ రోజు బుధవారం సంస్థలోని పలు విభాగాల కార్మికులు పాల్గొన్నారు. కేంద్ర ప్రభుత్వం ఎన్ని కుట్రలు చేసినా కార్మికులు ప్రతిఘటిస్తారని, ఉక్కు పరిశ్రమలోని ఒక్క రేకును కూడా కదల్చలేనివ్వరని అన్నారు. ఇప్పటికైనా ప్రభుత్వం తన నిరంకుశత్వ నిర్ణయాన్ని వదిలి, కార్మికులకు అండగా నిలబడాలని కోరారు. విశాఖ ఉక్కు పరిశ్రమను ప్రభుత్వరంగ సంస్థగానే కొనసాగిస్తున్నట్లు ప్రకటించాలన్నారు. కార్యక్రమంలో పోరాట కమిటీ నాయకులు, ఇతర కార్మికులు పాల్గొన్నారు.